

న్యూస్ బాక్స్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చందుర్తి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం మల్యాలలో బుధవారం ఐదుగురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు పత్తిపాక శంకర్, నాయకులు సంటి ప్రసాద్, ఫోన్‌చెట్టి వెంకటేష్, పంచెర్పుల దేవలింగు, ఈసారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

సర్వే పారదర్శకంగా చేపట్టాలి

చందుర్తి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో సమగ్ర కుటుంబ సర్వే పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల సర్వే, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై ఎన్యూమరేటర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కుటుంబ సర్వేలో ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. రిసోర్స్ పర్సన్స్ మందాడి శ్రీనివాస్ రెడ్డి, మాడిశెట్టి మహేష్, గడప రఘుపతిరావు శిక్షణ ఇచ్చారు.

పాఠశాలల్లో దీపావళి

రుద్రంగి అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) రుద్రంగి మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో బుధవారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. మండలంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విద్యార్థులు పాఠశాలలో పూలతో భారీ దీపం ఆకృతి ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు, కరస్పాండెంట్ ఏలిగేటి నరేష్, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

బోయినపల్లి:బోయినపల్లి మండలంలోని విలాసాగర్ హైస్కూల్లో బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొలగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముందస్తుగా దీపావళి వేడుకలు నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

ముస్తాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాపూర్‌కు చెందిన చిగురు నీరజ్ అనార్యోగానికి గురగా రూ. 75 వేల ఎల్‌వోసీని బాధిత కుటుంబానికి అందించారు. పేద కుటుంబానికి చెందిన నీరజ్ అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటుండగా ఆసుపత్రి ఖర్చుల కోసం ఎల్‌వోసీని అందించారు. కుటుంబ సభ్యులు విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 25 మంది పదోతరగతి విద్యార్థులకు గోపా సిరిసిల్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను బుధవారం పంపిణీ చేశారు. గోపా పట్టణ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, కోశాధికారి నాగరాజుగౌడ్, డాక్టర్ లక్ష్మణ్ గౌడ్, ముత్తయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఆనందాల కేళి.. దీపావళి

- మహాలక్ష్మి కొలువయ్యే వేళ
- ముస్తాబైన ఆలయాలు
- జిల్లాలో సందడి



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఆనందాల కేళి దీపావళికి వేళైంది. దివ్య కాంతుల దీపాలు వెలుగులు నింపనున్నాయి. పండగవేళ ఇంటింటా ఆధ్యాత్మికత ఉట్టిపడనుంది. మహాలక్ష్మీ పూజలు దీపావళి పండుగ ప్రత్యేకం. జిల్లాలోని రాజరాజేశ్వరస్వామి దేవస్థానంతో పాటు వివిధ ఆలయాలు ముస్తాబయ్యాయి. గురువారం లక్ష్మీదేవి పూజలను నిర్వహించడానికి వాణిజ్య సంస్థలు, దుకాణదారులు, ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు. దీపావళికి శోభనిచ్చే విధంగా టపాసుల అమ్మకాలు, నోరూరించే మిఠాయిలు, దుకాణాలను విద్యుద్దీపాల కాంతులతో వెలిగిపోనున్నాయి. గురువారం ఉదయం బోగి హారతులు, సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 11.30 గంటల వరకు ధనలక్ష్మీ పూజలు, కేదారేశ్వర నోములు జరుపుకోనున్నారు. వేముల వాడ దేవస్థానంలో తెల్లవారుజామున 3.30 గంటల నుంచి 3.40 వరకు ఉదయత్పూర్వం, 3.40 నుంచి 4.20 వరకు మంగళ వాయిద్యాలు, 4.20 నుంచి 4.30 నిమిషాల వరకు సుప్రభాత సేవ, 4.30 నుంచి 4.40 వరకు హారతి, దీపావళి పండుగ సంద ర్భం గా సాయం త్రం 4 గంటల నుంచి నరకాసుర వధ పురాణ కాలక్షేపం, 6.30 గంటల నుంచి స్వామివారి కల్యాణ మండపంలో ధనలక్ష్మీ పూజ, పెద్ద సేవల ఊరేగింపు నిర్వహిస్తారు.

దీపం జ్ఞానానికి ప్రతీక...

దీపం జ్ఞానానికి ప్రతీక. ఏ శుభకార్యం జరిగినా జ్యోతి ప్రజ్వలనతో మొదలవుతుంది. దీప కాంతిని త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు ప్రతీకలుగా కొలుస్తారు. దీపం సాక్షాత్తు లక్ష్మీదేవి, దీపావళి రోజున జగత్‌నంతటినీ కాంతిమయం చేస్తుంది.

వివిధ రాష్ట్రాల్లో....

దీపావళి పండుగ మన రాష్ట్రంతో పాటు వివిధ రాష్ట్రాల్లో ఆనందంగా జరుపుకుంటారు. అస్సాం, బెంగాల్‌లో జగదాత్రి పూజగా చేసుకుంటారు. ఒరిస్సాలో కూమార పూర్ణిమగా జరిపి దీపావళి వరకు కన్యలు ఆనంద దీపోత్సవాలతో ఆట పాటలతో కాలక్షేపం చేస్తారు. దక్షిణ భారతంలో బలి చక్రవర్తి అణిచిన మహావిష్ణువు విజయంగా కొందరు నరకాసుర వధ చేసిన శ్రీకృష్ణ విజయంగా పండుగను జరుపుకుంటారు. కేరళలో బలిచక్రవర్తిని జయించిన విజయోత్సవంగా, తమిళనాడులో తెల్లవారు జామున లేచి నరక చతుర్దశి జరుపుకుంటారు. కర్ణాటకలో మూడు రోజుల పాటు పండుగ జరుపుకుంటే రాజస్థాన్‌లో ధన్‌తేరాస్‌గా నిర్వహిస్తారు. మహిళలు ఆ రోజు నగలను నదిలో శుభ్రం చేసి పిల్లిని లక్ష్మీదేవిగా పూజిస్తారు. అన్ని రకాల వంటలు పిల్లికి నైవేద్యంగా పెడతారు. గుజరాత్‌లో పిండివంటలతో లక్ష్మీదేవికి పూజలు చేస్తారు. మహారాష్ట్రలో లక్ష్మీపూజ, గణేష్ పూజ జరుపుతారు. మార్వాడిలు దీపావళి రోజు నుంచే కొత్త ఖాతాలు ప్రారంభిస్తారు. ఉత్తర భారతంలో మహాలక్ష్మికి, దక్షిణాదిలోని కేరళలో పాతాళం నుంచి బలిమహారాజు భూమిపైకి వచ్చి దర్శనమిస్తాడని భావిస్తారు.

వాట్సప్, పేస్ బుక్‌లో మెరుపులు

సోషల్ మీడియాలో దీపావళి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. వాట్సప్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌తోపాటు వివిధ యాప్‌ల ద్వారా దీపావళి శుభాకాంక్షలు చెప్పుకుంటున్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

అగ్నిమాపక శాఖ సిరిసిల్ల అధికారి నరేందర్

ఇంటర్వ్యూ



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

'దీపావళి అంటే టపాసులు కాల్చడంతోనే సందడి. అయితే అజాగ్రత్తగా ఉంటే ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. జాగ్రత్తగా టపాసులు కాల్చాలి' అని అగ్నిమాపక శాఖ సిరిసిల్ల అధికారి ఎన్.నరేందర్ తెలిపారు. టపాసుల విక్రయదారులు దుకాణాలు అగ్నిమాపక శాఖ జారీ చేసిన నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవన్నారు. బుధవారం ఆంధ్రజ్యోతితో పలు అంశాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి : సిరిసిల్ల ఫైర్ స్టేషన్ పరిధిలో ఎన్ని దుకాణాలు ఏర్పాటు చేశారు?

అగ్నిమాపక శాఖ అధికారి: సిరిసిల్ల ఫైర్ స్టేషన్ పరిధిలో జిల్లా కేంద్రం, మండలాలతో కలిపి 65 దుకాణాలకు అనుమతులు పొందారు.

ఆంధ్రజ్యోతి : దుకాణ దారులకు నిబంధనలు ఏమిటి?

అగ్నిమాపక శాఖ అధికారి: రోడ్లపై, జనావాసాల మధ్య టపాసుల దుకాణాలకు అనుమతులు లేవు. మైదాన ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలి. దుకాణాల మధ్య దూరం పాటిం చాలి. రెండు డ్రమ్ములు, 400 లీటర్ల నీళ్లు, రెండు ఎస్టింగ్ మిష న్స్ అందుబాటులో ఉండాలి. దు కాణాల్లో 18 సంవత్సరాల లోపు పిల్లలతో పనిచేయించవద్దు. నిబం ధనలు అతిక్రమిస్తే ఫైర్ యాక్ట్ 99 ప్రకారం చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి : టపాసులు కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి?

అగ్నిమాపక శాఖ అధికారి: టపాసులు కాల్చేటప్పుడు కాటన్ దుస్తులు ధరించాలి. లూజుగా ఉండే దుస్తులు ధరించవద్దు. పెద్దల సమక్షంలో పిల్లలు టపాసులు కాల్చా లి. కళ్లకు అద్దాలు పెట్టుకోవడం మంచిది. టపాసులు కాల్చే సమయంలో పక్కన ఇతరులు కాలుస్తున్నది లేనిది చూసుకోవాలి. ఇంటి బయట బహిరంగ ప్రదేశంలో కాల్చాలి. బాణాసంచా కాల్చే స్థలంలో నీళ్లను అందుబాటులో ఉంచు కోవాలి. సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 8 గంటల నుంచి 10 గంటల లోపు కాల్చాలి.

ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రజలందరికీ ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు, ఎయిడ్స్, టీబీ, కుష్టు నివారణ తదితర అంశాలపై చర్చించారు. జిల్లాలో ఏ కేసులు ఎన్ని నమోదయ్యాయి? వారికి ఎలాంటి వైద్యసేవలు, మందులు అందిస్తున్నారో? అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మొత్తం టీబీ కేసులు 831, ఎయిడ్స్ కేసులు 550, కుష్టు కేసులు 14 ఉన్నాయని జిల్లా వైద్యాధికారి వసంత్‌రావు వివరించారు. కేసులు ఎక్కడ నమోదు అవుతున్నాయి? కారణాలు ఏమిటి, నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై కలెక్టర్ తెలుసుకున్నారు. ప్రతీ నెల సమీక్ష సమావేశాన్ని నిర్వహించి పురోగతి తెలుసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సాంస్కృతిక కళాకారులతో జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రితోపాటు ఏరియా ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, సబ్ సెంటర్‌లలో నిర్ధారణ పరీక్షలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంత్‌రావు, డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వోలు డాక్టర్ రాజగోపాల్, డాక్టర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

సిరిసిల్ల అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల బల్దియా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం అవసరమైన నిధులను మంజూరు చేసింది. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి అధ్యక్షతన సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. 12 అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. సిరిసిల్ల పారిశుధ్య నిర్వహణలో భాగంగా ప్రధాన మురికి కాలువలో షెల్డ్‌ను తొలగించడానికి ఎక్స్‌కావేటర్ కొనుగోలుకు రూ.26 లక్షలు మంజూరు చేశారు. వివిధ వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల నిర్మాణానికి రూ.12 లక్షలు మంజూరు ఇచ్చారు. సిరిసిల్ల పట్టణంలో పారిశుధ్యంలో మాన్యువల్ స్వీపింగ్ మిషన్ కొనుగోలు, బ్లీచింగ్, సున్నం పౌడర్ కొనుగోలుకు రూ.9 లక్షలు మంజూరు చేశారు. ఇతర వాహనాల మరమ్మతు, ట్రాకింగ్ సిస్టమ్‌ల ఏర్పాటుకు రూ.12 లక్షలు మంజూరు చేశారు. క్లోరినేషన్, పంపుసెట్ల రిపేర్ కోసం రూ.13 లక్షలు మంజూరు ఇచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ లావణ్య, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంబరాలు


- కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

8లో..




























రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు అంకిత్ ఎంపిక

సైదాపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి, సైదాపూర్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు, వెన్కేపల్లి మాజీ సర్పంచ్ దొంత సుధాకర్ కుమారుడు దొంత అంకిత్ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. కరీంనగర్‌లో జరిగిన జోనల్ లేవల్ స్విమ్మింగ్ పోటీల లో అంకిత్ ప్రతిభ కనపర్చి స్టేట్ లేవల్ పోటీలకు ఎంపికయ్యాడు. అంకిత్ ను, అంకిత్‌కు శిక్షణ ఇచ్చిన అతని తండ్రి దొంత సుధాకర్‌ను మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి, తహసీల్దార్ మంజూల, ఎంపీడీవో యాదగిరి, ప్రధానోపాధ్యాయుడు దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ క్షేత్రాన్ని సందర్శించిన ఏడీఏ



ఆయిల్‌పామ్ సాగులో అంతర్ పంట మునుగ మొక్కలు నాటుతున్న ఏడీఏ సునీత

హుజూరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఇప్పల్‌నర్సింగాపూర్ గ్రామంలో ఆయిల్ పామ్ పంట క్షేత్రాన్ని ఏడీఏ సునీత బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయిల్ ఫామ్ పంటల్లో అంతర్ పంటల్లో భాగంగా మునుగ మొక్కలు నాటారు. అనంతరం ఏడీఏ సునీత మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ పంట చేతికచ్చే మూడేళ్ల వ్యవధిలో అంతర పంట ద్వారా ఆదాయాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవో భూమిరెడ్డి, ఏఈవో నిఖిల్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

స్వగ్రామం చేరిన మృతదేహం

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపేట గ్రామానికి చెందిన మారంపల్లి సుధీర్ (35) అనే యువకుడి మృతదేహం బుధవారం స్వగ్రామం చేరుకుంది. సుధీర్ ఉపాధి కోసం గల్ఫ్ బాటపట్టాడు. బెహరన్ దేశంలోని ఓ ప్రైవేటు కంపెనీలో కార్మికుడిగా పని చేసేవాడు. కుటుంబ పోషణ, గల్ఫ్ వెళ్లడానికి చేసిన అప్పులు తీర్చే మార్గం లేక అప్పుల ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. దీంతో బెహరన్‌లో దేశంలో నివాసం ఉంటున్న తన రూములో ఈనెల 24న రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు స్నేహితులు కుటుంబ సభ్యులకు సమచారం అందించారు. సుదీర్ మృతదేహం వారం ఆరు రోజుల తరుతవాత స్వగ్రామానికి చేరుకుంది.

ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని, కోడెమొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.

● ఉద్యోగులు చేసిన సేవలే గుర్తింపు నిస్తాయని రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌లు పెద్దిరెడ్డి భూంరెడ్డి, కొండం శ్రీనివాస్‌రెడ్డి, స్వీపర్ మంగమ్మల పదవీ విరమణ సందర్భంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం కార్యదర్శి కూరగాయాల శ్రీనివాస్ ఏఈవోలు శ్రావణ్, జయకుమారి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో వెలుతున్న భక్తులు

కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం..

పాలకుర్తి, కళ్యాణ్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పాలకుర్తి మండల వ్యాప్తంగా బుధవారం కురిసిన వర్షంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లో పోసిన వరి ధాన్యం తడిసిపోయింది. రెండు రోజులుగా వాతావరణంలో మార్పుల కారణంగా ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. బుధవారం మధ్యాహ్నం వర్షం కురియడంతో జయ్యారం, పుట్నూర్, కుక్కలగూడూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. కేంద్రాల్లో రైతులకు టార్పాలిన్ కవర్లు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నామని జయ్యారం గ్రామానికి చెందిన రైతు మేర్గు బొర్రయ్య తెలిపారు. కాగా, గోదావరిఖనిలో బుధవారం భారీ వర్షం కురిసింది. అకస్మాత్తుగా వర్షం కురవడంతో దీపావళి సందర్భంగా చిరువ్యాపారులు తీవ్రఇబ్బందులు పడ్డారు.

● గంగాధర, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లో తూకానికి తీసుకువచ్చిన ధాన్యం వర్షానికి తడిసిపోయింది. ఆరబోసిన ధాన్యం తేమ శాతం వచ్చి మరో నాలుగైదు రోజుల్లో తూకానికి కుప్ప చేద్దామని అనుకున్న తరుణంలో కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోయి రైతులను ఆవేదనకు గురిచేసింది. గంగాధర మండలంలో బుధవారం ఉదయం ఎండగా ఉండి ఒక్కసారి వర్షం కురిసింది. దీంతో అమ్మకానికి తీసుకువచ్చిన ధాన్యం తడిసిపోయింది. గంగాధర, లక్ష్మీదేవిపల్లి, నాగిరెడ్డిపూర్, బూరుగుపల్లి, లింగంపల్లి, కొండయ్యపల్లి, చర్లపల్లి గ్రామాల్లో వర్షానికి ధాన్యాన్ని తడవకుండా క వర్లు కప్పడానికి రైతులు తిప్పలు పడ్డారు. కేంద్రాల్లో టార్పాలిన్లు లేక రైతులు కిరాయికి తీసుకువచ్చి ధాన్యం తడవకుండా కాపాడుకున్నారు. పూర్తిగా ఆరిన ధాన్యం తడవడంతో రైతులు ఆందోళన చెందారు. కేంద్రాలకు తీసుకువచ్చి 20రోజులైన ఇప్పటికి కొనుగోలు జరపడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు కేంద్రాల్లో త్వరగా తూకాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.



గంగాధరలో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు

చెట్లను నరికితే చర్యలు తప్పవు

● ఎఫ్ఆర్‌వో ఖలీలుద్దీన్

రుద్రంగి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో ఎవరైనా చెట్లను నరికితే చర్యలు తప్పవని ఎఫ్ఆర్‌వో ఖలీల్ ఉద్దీన్ హెచ్చరించారు. రుద్రంగి మండల కేంద్రంలో ధాన్యం కల్లాలకోసం సరైన స్థలం లేక పోవడంతో బుధవారం రుద్రంగి శివారులోని గండి వేంకటేశ్వర ఆలయ సమీపంలో రైతులు చెట్లను నరికారు. సమాచారం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు అడ్డుకున్నారు. అనంతరం ఎఫ్ఆర్‌వో ఖలీల్‌ఉద్దీన్ మాట్లాడుతూ ధాన్యం ఆరబోతకు స్థలం లేదని రైతులు తెలిపారని, సుమారు 350 వందల మంది రైతులు 150 వరకు చెట్లను నరికి వేశారని అన్నారు. చెట్లు నరకవద్దని రైతులకు నచ్చజెప్పామన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో చెట్లు నాటుకుంటా వెళ్తుంటే కొందరు నరికివేస్తున్నా రన్నారు. రుద్రంగి, చందుర్తి మండలాల్లో గిరిజన తండాలు ఎక్కువగా ఉన్నాయని పోడు భూము లకు పట్టాలు వస్తాయని ఆశతో అటవీ ప్రాంతంలో చెట్ల ను నరికి భూమిని చదును చేస్తున్నారన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి స్థలం కావాలంటే తహసీల్దార్‌తో మాట్లాడి సమస్య పరిష్కరించేవాళ్లమన్నారు. కోరుట్ల- వేములవాడ ప్రధాన రహదారి వెంట కలికోట సూరమ్మ ప్రాజెక్టుకు వేళ్లే కాలువ సూమారు రెండు కిలోమీటర్లు ఉంటుందని, దాని పక్కన స్థలాన్ని చదును చేసుకుంటే ధాన్యం ఆరబోతకు వీలుగా ఉంటుందని తెలిపారు. అడవులను కాపాడుకుంటేనే అక్సిజన్ ఉంటుందని, కావాలని ఎవరైనా ఫారెస్టులో చెట్లను నరికితే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. సెక్షన్ ఆఫీసర్ రాఘవేంద్రరావు పాల్గొన్నారు.



నరికిన చెట్లను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

జాతీయ స్థాయిలో రామానుజమ్మకు బంగారు పతకాలు



స్వర్ణపతకం అందుకుంటున్న రామానుజమ్మ

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్లకు చెందిన కమటం రామానుజమ్మ ఈ నెల 27న మహారాష్ట్రలోని నాసిక్‌లో నిర్వహించిన జాతీయ వెటరన్ అథ్లెటిక్స్ పోటీలో సత్తా చాటింది. 70 సంవత్సరాలలోపు మహిళల విభాగంలో 1500 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెంలో ప్రత్యర్థులను చిత్తు చేసి బంగారు పతకాలను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా బుధవారం సిరిసిల్ల పట్టణంలో వెటరన్ అథ్లెటిక్స్ జిల్లా అసోసియేషన్ సభ్యులు రామానుజమ్మను అభినందించారు.

బస్టాండ్‌లో చోరీలకు పాల్పడే అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

● బంగారం, నగదు, సెల్‌ఫోన్‌ల స్వాధీనం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల బ్యాగ్‌లు, సెల్‌ఫోన్లను చోరీ చేసిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన నలుగురిని కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి 23 గ్రాముల బంగారం, 36 వేల నగదు, 8 సెల్‌ఫోన్‌లు, ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నారు. సీఐ బిల్ల కోటేశ్వర్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. కరీంనగర్ శివారులోని డీర్‌పార్క్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక ఇన్నోవా కారులో నలుగురు అనుమానాస్పదంగా కనపడగా అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. వారు మహారాష్ట్ర భుసావల్ జిల్లా జల్గామ్ ప్రాంతానికి చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులు పసుపులేటి దుర్గా, పసుపులేటి రాము, పసుపులేటిరవి, పసుపులేటి రేణులుగా వెల్లడైందని సీఐ తెలిపారు. ఈనెల 6న ఈ ముఠా కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణికురాలి బ్యాగ్‌లో నుంచి బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారని తెలిపారు. నిందితులు నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

రామడుగు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కొన్న భూమిని అక్రమంగా మరో వ్యక్తికి విక్రయించడమే కాకుండా తనను చంపుతానని సదరు వ్యక్తులు బెదిరించడంతో బుధవారం ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ శేఖర్ కథనం ప్రకారం.. వెలిశాల గ్రామానికి చెందిన దైవాల రమేష్(35) తల్లి దైవాల వరమ్మ 2004లో 35 గుంటల భూమిని కొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన పల్లెర్ల దేవిక నుంచి కొనుగోలు చేశారు. ఈ క్రమంలో దైవాల రమేష్ అందులో పంట సాగు చేస్తు న్నాడు. అయిత రమేష్‌కు తెలియకుండానే దేవిక అక్రమంగా సింగు హరిబాబుకు ఇదే భూమిని రిజిస్ట్రేషన్ చేసినట్లు గ్రహించిన రమేష్ ఆయన కుటుంబ సభ్యులు ఇలా ఎలా చేశావని దేవికను నిలదీశారు. రిజిస్ట్రేషన్ విషయంలో అడిగినందుకు దైవాల రమేష్‌ను పల్లెర్ల దేవిక, సింగు హరిబాబు, సింగు శ్రీకాంత్, సింగు శ్రీనివాసులు చంపుతానని బెదిరిస్తున్నారని ఆవేదనకు గురయ్యాడు. బుధవారం గ్రామంలోని అయ్యవారి కుంటలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు. ఈ నెల 29న తనపై గతంలో తమకు భూమిని అమ్మిన వారు అక్రమంగా వేరే వారికి రిజిస్ట్రేషన్ చేసి తనను చంపాలని ప్రయత్నిస్తున్నారని, స్థానిక ఎస్‌ఐకి రాసిన లెటర్ రమేష్ ఇంట్లో బయట పడింది.

వరి గడ్డి మిషన్‌లో చెయ్యి ఇరుక్కొని ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఉప్పారపు మనోజ్ చెయ్యి వరిగడ్డి కట్టే మిషన్‌లో ఇరుక్కొని బుధవారం తీవ్రగాయాలయ్యాయి. లక్ష్మీపూర్‌కు చెందిన మనోజ్ మిషన్‌తో వరిగడ్డిని కట్టలు కడుతుండగా ప్రమాదవశాత్తు కుడి చెయ్యి ఇరుక్కొని తీవ్రగాయాలు అయ్యాయి. గ్రామస్తులు చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

ప్రభుత్వ అనుమతి లేకుండా క్రషర్ నిర్మాణం

● సామగ్రిని గ్రామ పంచాయతీకి తరలించిన గ్రామస్థులు

శంకరపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కాచాపూర్ గ్రామంలో ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్మాణం చేపట్టిన క్రషర్ సామగ్రిని గ్రామస్థులు గ్రామ పంచాయతీకి తరలించారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం వీణవంక మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన ఓల్లెపు సమ్మయ్య, ప్రభుత్వ అనుమతులు పొందకుండా కాచాపూర్ శివారులో క్రషర్ నిర్మాణం చేపట్టారు. గ్రామస్థులు బుధవారం ఉదయం క్రషర్ వద్దకు వెళ్లగా పురుగుల మందు డబ్బాతో వచ్చిన మహిళ నిర్మాణం తొలగించవద్దని గ్రామస్థులతో వాగ్వాదానికి దిగారు. అనుమతులు లేకుండా క్రషర్ నిర్మాణం ఎలా చేపడతారని గ్రామస్థులు ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలంలో ఎలాంటి నిర్మాణం చేపట్టవద్దని గ్రామస్థులు క్రషర్ సామగ్రిని ట్రాక్టర్‌లో వేసి గ్రామపంచాయతీకి తరలించారు. సమాచారం తెలుసుకున్న సర్వేయర్ సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు.



క్రషర్ సామగ్రిని ట్రాక్టర్‌లో గ్రామపంచాయతీకి తరలిస్తున్న గ్రామస్థులు

రైల్వే ఆస్తుల రక్షణే ఆర్‌పీఎఫ్ లక్ష్యం

● ఆర్‌పీఎఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ శధాన్ జెబ్ ఖాన్

అంతర్గాం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఆస్తుల పరిరక్షణే ప్రధాన లక్ష్యమని ఆర్‌పీఎఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ శధాన్ జెబ్ ఖాన్ అన్నారు. బుధ వారం ఆయన రామగుండం పట్టణంలోని ఆర్‌పీఎఫ్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌పీఎఫ్ ప్రయాణికుల భద్రత కోసం పటిష్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. రైళ్లలో నిషేధిత వస్తువులు, పదార్థాలు రవాణా చేస్తే కఠిన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లోనేరాలు తగ్గించేందుకు ప్రయాణికుల భద్రత కోసం రైళ్లలో సీసీ కెమెరాలు అమర్చనున్నట్లు తెలిపారు. అనంతరం రికార్డులు తనిఖీ చేసి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ కమిషనర్ సుభాష్, సీఐ బుర్ర సురేష్ గౌడ్, ఎస్‌ఐ కాంతి, ఏఎస్‌ఐలు శేఖర్‌రెడ్డి, సుభాష్, సిబ్బంది పాల్గొన్నారు.



రామగుండంలో మాట్లాడుతున్న ఆర్‌పీఎఫ్ డీఐజీ శధాన్ జెబ్ ఖాన్

భార్యను హతమార్చిన భర్త

మల్లాపూర్, అక్టోబరు, 30 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని వేంపల్లిలో భార్యను భర్త హతమార్చాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంపల్లి గ్రామానికి చెందిన వెల్మల రమేష్‌కు పన్నెండ్ల క్రితం రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన సునీత(27)తో వివాహం జరిగింది. కొంత కాలం తర్వాత జీవనోపాధి నిమిత్తం రమేష్ గల్ఫ్ దేశానికి వెళ్లాడు. నెల క్రితం రమేష్ స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. వచ్చినప్పటి నుంచి రమేష్ భార్యపై అనుమానం పెంచుకొని నిందించడంతో ఇరువురి మధ్య గొడవలు జరుగుతున్నాయి. బుధవారం ఉదయం ఇదే విషయంపై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. రమేష్ ఆవేశంతో భార్య సునీతను గోడకేసి బాదగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో సునీత అక్కడిక్కడే మృతి చెందింది. అనంతరం రమేష్ ఇంటి నుంచి పారిపోయాడు. సమాచారం తెలుసుకున్న మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరి రావు, కోరుట్ల సీఐ సురేష్‌బాబు, ఎస్సై కిరణ్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. సునీత తండ్రి మందుల గంగరాజం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



వెల్మల సునీత(ఫైల్)

క్రైం కార్నర్

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

ముత్తారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ముత్తారం మండలంలోని కేశనపల్లి గ్రామానికి చెందిన అలువోజు వెంకటేష్(24) అనే యువకుడు మద్యానికి బానిసై మంగళవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రపోతున్న సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేష్ కొంతకాలంగా మద్యానికి బానిసై మనస్థాపంతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. మృతుడి తండ్రి అలువోజు స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

తల్లిదండ్రులు మందలించడంతో..

కరీంనగర్ క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి పనిచేయకుండా తిరుగుతున్నావని తల్లిదండ్రులు మందలించడంతో కొత్తపల్లి మండలం రేకుర్తి గ్రామానికి చెందిన లింగంపల్లి అజయ్(20) అనే యువకుడు మంగళవారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. కొత్తపల్లి పోలీసుల వివరాల ప్రకారం అజయ్ ఎలాంటి పనిచేయకుండా ఉదయం ఇంటి నుంచి వెళ్లి అర్ధరాత్రి ఇంటికి వచ్చేవాడు. తల్లిదండ్రులు గ్రామంలోనే హోటల్ నిర్వహిస్తున్నారు. కనీసం హోటల్ పనిలో సహాయం చేయమని అడిగినప్పటికీ రావటం లేదని తల్లిదండ్రులు మందలించారు. మంగళవారం ఇంటిలో పడుకున్న అజయ్ అర్ధరాత్రి తరువాత సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ సమయంలో పై అంతస్థులో తల్లిదండ్రులు నిద్రిస్తున్నారు. వేకువజామున చూసేసరికి అజయ్ ఉరికి వేళాడుతూ కనిపించాడు. మృతుడి తండ్రి మల్లేశం ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

శంకరపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం వంకాయగూడెం గ్రామశివారులో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మక్త గ్రామానికి చెందిన పంచకోటి గోపి (30) మంగళవారం రాత్రి బైక్‌పై వంకాయగూడెం గ్రామ శివారులో గల ఓ హోటల్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా హుజూరాబాద్ వైపు నుంచి వస్తున్న లారీ డ్రైవర్ అతివేగంగా బైక్‌ను ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు పంచకోటి రమేష్ దరఖాస్తు ఇవ్వగా లారీ డ్రైవర్ పైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

మతిస్థిమితం లేని మహిళపై అత్యాచారం

● గర్భం దాల్చిన మహిళ ● ఒకరిపై కేసు నమోదు

మల్యాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్యాలకు చెందిన మతిస్థిమితం లేని ఓ మహిళపై సమీప బంధువు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆ మహిళ కుటుంబసభ్యులతో కలిసి ఏడు నెలల క్రితం బంధువుల ఇంట్లో శుభకార్యానికి పక్క మండలానికి వెళ్లింది. అక్కడ ఒంటరిగా ఉన్న మహిళపై సమీప బంధువైన ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎవరికీ చెప్పవద్దని బెదిరించాడు. ఇటీవల మహిళ అస్వస్థతతకు గురికావడంతో రెండు రోజుల క్రితం కుటుంబసభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి గర్భిణి అని తెలిపారు. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా అత్యాచారం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

ఐదుగురు పోకిరీల అరెస్ట్

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 30: విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేసిన ఐదుగురు పోకిరీలను బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహజన్ తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వద్ద కొంతమంది పోకిరీలు బైక్‌లపై ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారని, విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. అదుపులోకి తీసుకొని విచారించి కేసు నమోదు చేశామన్నారు. మహిళలను, విద్యార్థునులను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వేధింపులకు గురైతే డయల్ 100 లేదా షీటీమ్ నంబరు 8712656425కు కాల్‌చేసి చెప్పాలన్నారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్టు

చందుర్తి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం కోసం వేధించి భార్య ఆత్మహత్యకు కారకుడైన భర్తను రిమాండ్‌కి పంపినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. నర్సింగాపూర్‌కు చెందిన ఆరెల్లి శంకర్ బాబుకి 10 సంవత్సరాల క్రితం అపర్ణతో వివాహమైంది. ఒక బాబు, ఒక పాప ఉన్నారు. కొంతకాలంగా అపర్ణను ద్విచక్ర వాహనంతోపాటు అదనంగా లక్ష రూపాయలు వరకట్నం తీసుకురావాలని మానసికంగా, శారీరకంగా వేధించాడు. ఈ విషయమై పలుమార్లు ఆరెల్లి శంకర్ బాబుతో మాట్లాడినా తన ప్రవర్తన మార్చుకోకుండా అదనపు కట్నం తీసుకొస్తేనే ఇంట్లో ఉండు లేదంటే ఎక్కడికి వెళ్లాలని ఆదేశించాడు. దీంతో అపర్ణ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. భార్య ఆత్మహత్యకు శంకర్ బాబు కారకుడని మృతురాలి తల్లి కొంపెల్లి శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యప్తు చేసి రిమాండ్ కి పంపనట్లు సీఐ తెలిపారు.

అంబులెన్స్-కారు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

మానకొండూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శంషాబాద్ బస్టాండ్ వద్ద బుధవారం ప్రయివేటు అంబులెన్స్ కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన మేరుగు శ్రీకాంత్, బొలగం చందన్‌లు కారులో కరీంనగర్ నుంచి హుజూరాబాద్‌కు వెళ్తుండగా అం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

ఖనిలో రెండు మినీ ఏటీఎంలను కొల్లగొట్టిన సైబర్‌నేరస్థులు

కోల్‌సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బ్యాంకులకు వరుస సెలవులను ఆసరా గా తీసుకున్న సైబర్ నేరస్థులు బుధవా రం గోదావరిఖని మార్కండేయకాలనీ లోని రెండు మినీ ఏటీఎంలను కొల్లగొట్టారు. మినీ ఏటీఎం నిర్వాహకులు సమీపంలోని రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులకు ఒకరికి తెలియ కుండా ఒకరికి ఫోన్ చేసి బురిడీ కొట్టిం చారు. స్థానిక మార్కండేయ కాలనీలోని ఒక కార్పొరేట్ బ్రాండెడ్ బిర్యానీ సెంటర్ కు ఫోన్ చేసిన సైబర్ నేరస్థుడు తనకు 55 బిర్యానీ ప్యాకెట్‌లు అవసరమని, సమీపంలోని మినీ ఏటీఎంలో డబ్బులు తీసుకోవాలని సూచించారు. అప్పటికే ఏటీఎం నిర్వాహకుడికి కూడా ఫోన్ చేసిన సైబర్ నేరస్థుడు తాను ఒక మనిషిని పంపుతున్నానని, అతడు నగదు ఇస్తాడని, కమిషన్ తీసుకొని మిగతా డబ్బులు తన అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేయమని చెప్పాడు. అనుకున్నట్టుగానే రెస్టారెంట్ ఉద్యోగి మినీ ఏటీఎంకు పోవడంతో సదరు మినీ ఏటీఎం నిర్వాకుడు ఎలాంటి వాకబు చేయకుండానే సైబర్ నేరస్థుడు చెప్పిన అకౌంట్‌కు రూ.45000 ట్రాన్స్‌ఫర్ చేశారు. అలాగే గోదావరిఖని మార్కండేయకాలనీలోని మరో మినీ ఏటీఎంకు ఫోన్ చేసిన సైబర్ నేరస్థుడు తాను సమీపంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రి ఎండీనని, తనకు పెట్రోల్ బంకులు, ఇతర వ్యాపారాలు ఉన్నాయని నమ్మబలికాడు. బ్యాంకులకు వరుస సెలవులు ఉన్నాయని అందువల్ల తనకు నగదు అవసరం ఉందన్నాడు. తన ఉద్యోగి మీ వద్దకు వస్తాడని నగదు ఇస్తాడని కమిషన్ తీసుకొని మిగతా డబ్బులు తన అకౌంట్‌కి కొట్టాలని చెప్పాడు. పక్కనే ఉన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ యజమానికి ఫోన్ చేసి తనకు కొన్ని పార్సిల్స్ అవసరమని డబ్బులు పక్కనే ఉన్న మినీ ఏటీఎంలో తీసుకోవాలని చెప్పాడు. ఒకరికి తెలియకుండా ఒకరికి చెప్పడంతో మినీ ఏటీఎం సెంటర్ నిర్వాహకుడు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడిని ఉద్యోగిగా నమ్మాడు. అతడు రావడంతోనే రూ.55వేల సొమ్మును సైబర్ నేరగాడు చెప్పిన అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశాడు. తర్వాత ఫోన్లు స్విచ్‌ఆఫ్ అవడంతో లబోదిబోమనానరు. సైబర్‌క్రైమ్ నంబర్ 1930కు ఫిర్యాదు చేసి వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు.

న్యూస్ బాక్స్

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి

● కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జాతీయ స్థాయి సబ్ జూనియర్ యోగాసన చాంపియన్‌షిప్‌లో తొలిసారిగా స్వర్ణ పతకం సాధించిన జిల్లాకు చెందిన పురాణం దీపక్‌ను బుధవారం కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ యోగా అసోసియేషన్ ఛైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి ఏ శ్రీనివాస్‌గౌడ్, జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, యోగా కోచ్ వి కిష్టయ్య, మల్లీశ్వరి, గుంజపడుగు హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు జగిత్యాల విద్యార్థులు

జగిత్యాల క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ప్రభుత్వ పాఠశాల ల కబడ్డీ పోటీల్లోని అండర్-17 విభాగంలో జగిత్యాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి ఆరే తిరుపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 3 నుంచి 5 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలోని రచాల గ్రామంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి శాన్వి, వైశాలి, శబనా, హారిక ఎంపికైనట్లు వివరించారు. ఉమ్మడి జిల్లా జట్టుకు శాన్వి కెప్టెన్‌గా వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను పలువురు పీఈటీలు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు రేచపల్లి విద్యార్థి ఎంపిక

సారంగాపూర్, అక్టోబరు, 30: మండలంలోని రేచపల్లి గ్రామానికి చెందిన భూక్య శ్రీచరణ్ రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో జరిగిన పాఠశాల క్రీడ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచాడు. దీంతో నవంబరు 2న మమబూబాద్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ అండర్-17 విభాగంలో రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించాడు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయికి ఎంపికైన శ్రీచరణ్‌ను గ్రామ ప్రజలు, మండల నాయకులు అభినందించారు.



ట్రెక్కింగ్ చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు(ఫైల్)

ట్రెక్కింగ్‌లో ప్రతిభ

● పాఠశాల స్థాయి నుంచి సైనిక శిక్షణలో రాణిస్తున్న ఖని ఎన్‌సీసీ కేడెట్లు ● జాతీయ స్థాయి శిబిరాలు, సాహసోపేతమైన యాత్రలు

ప్రకృతిని, కొత్త ప్రదేశాలను అన్వేషించడానికి అడవులు, పర్వత ప్రాంతాల్లో ట్రెక్కింగ్ చేస్తారు. సాధారణ నడక కంటే ఎక్కువ పొడవుగా, సవాలుగా ఉంటుంది. ఆయా ప్రాంతాల్లోని విషయాలను గ్రహించేందుకు, వాటిపై అవగాహన పెంచుకునేందుకు, అక్కడి పరిస్థితులను ఆకలింపు చేసుకునేందుకు దోహదపడుతుంది. కఠోరమైన మార్గాల్లో ప్రయాణించడంతో శారీరక ధృడత్వాన్ని, మానోధైర్యాన్ని పెంపొందిస్తుంది. తద్వారా సమస్యలను అధిగమించే శక్తియుక్తులను ఇనుమడింపజేస్తుంది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన ఎన్‌సీసీ కేడెట్లు జాతీయస్థాయి ట్రెక్కింగ్ శిబిరాల్లో పాల్గొంటూ సత్తా చాటుకుంటున్నారు.

కోల్‌సిటీటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే సాహసోపేతమైన యాత్రలు చేస్తూ పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ఎన్‌సీసీ కేడెట్లు ప్రతిభను చాటుకుంటున్నారు. పాఠశాల స్థాయి నుంచే సైనిక శిక్షణ పొందుతూ జాతీయ స్థాయి శిబిరాల్లో పాల్గొని నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటున్నారు.

9వ తెలంగాణ బెటాలియన్‌కు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు జాతీయస్థాయిలో నిర్వహించే శిబిరాలు, ట్రెక్కింగ్‌తో పాటు రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్ లలో పాల్గొంటూ ఈ ప్రాంత ఖ్యాతిని చాటు తున్నారు. ఇటీవల ఎం.అమృత్‌సాయి అనే కేడెట్ హిమాచల్ ప్రదేశ్ లోని మౌంట్ పటా ల్బాలో 1400 మీటర్లను 12 గంటల వ్యవధిలో పూర్తిచేసి రికార్డు సృష్టించాడు. అంతేకాకుం డా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అరకులో జరిగిన జాతీయ స్థాయి ట్రెక్కింగ్ శిబిరంలో కేడెట్లు ఎస్.అచ్యుతానందు, పి.కార్తీక్, కె.రాజ్‌కుమార్, కె.సాయిచరణ్ పాల్గొని 10 రోజుల పాటు సాహస యాత్రలు, ఆ ప్రాంతం స్థితిగతులు తెలుసుకున్నారు. తమిళనాడులోని ఊటీ ప్రాంతంలో జరిగిన ఆలిండియా ట్రెక్కింగ్ ఎక్స్ పిడిషన్‌లో కేడెట్లు రితిక శ్రీ, సాధ్వీయాదవ్, శౌర్య శ్రీనర్తన పాల్గొన్నారు.



జాతీయస్థాయి ట్రెక్కింగ్‌లో పాల్గొన్న ఖని ఎన్‌సీసీ కేడెట్లు

విషయ పరిజ్ఞానం, మనోధైర్యం పెరిగింది.

\- ఎం.అచ్యుతానందు, కేడెట్



అరకులో జరిగిన జాతీయ స్థాయి ట్రెక్కింగ్‌లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. వారం రోజుల పాటు జరిగిన ఈ శిబిరంలో ఆ ప్రాంతంలోని ప్రత్యేకతలు, చారిత్రాత్మక విషయాలపై అవగాహన కల్పించారు. వాటర్ ఫాల్స్, గిరిజన మ్యూజియం, చాక్లెట్ ఫ్యాక్టరీలు, ఒరిస్సా రాష్ట్రం సరిహద్దు చూడటం తదితర విషయాలు తెలుసున్నాను. ఈ యాత్రతో మంచి అనుభూతి కలిగింది. యాత్ర ద్వారా విషయ పరిజ్ఞానం, మనోధైర్యం పెరిగింది..

ఆ ప్రాంతంలోని పరిస్థితులపై అవగాహన..

\- ఎస్.రితిక శ్రీ, కేడెట్



తమిళనాడు ఊటీలో జరిగిన ట్రెక్కింగ్ యాత్ర విషయ పరిజ్ఞానంతో పాటు మనోధైర్యాన్ని నింపింది. ఫస్ట్ ఆఫీసర్ ప్రోత్సాహం వల్లనే ట్రెక్కింగ్ శిబిరంలో పాల్గొన్నాను. ట్రెక్కింగ్ ద్వారా ఆ ప్రాంత స్థితిగతులు, ఆ ప్రాంత వాసుల ఆహార అలవాట్లను తెలుసుకు న్నాను. పలు ప్రదర్శనల్లో పాల్గొన్నందుకు బంగారు పతకం అందుకున్నాను.

విద్య, ఉద్యోగావకాశాలు..

\-జ్యోత్స్న, ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్, సెక్రెడ్ హార్ట్ స్కూల్



ఇలాంటి జాతీయ ట్రెకింగ్స్ శిబిరాల వల్ల విద్యార్థుల్లో ఏదైన ఎదుర్కొనే మానసిక ధైర్యం పెరుగుతుంది. ఫిజికల్ ఫిట్‌నెస్‌కు ఎంతో దోహదపడుతుందని వారినే మాత్రమే ఎంపిక చేస్తారు. ఎన్‌సీసీలో ఏ, బీ, సీ సర్టిఫికెట్స్ అందుకోవడం వల్ల భవిష్యత్‌లో ఉన్నత విద్య, ఉద్యోగాల్లో అవకాశం దొరుకుతుంది. పాఠశాల నుంచి మా కేడెట్లు జాతీయస్థాయి శిబిరాలు, రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొని బెస్ట్ కేడెట్స్‌గా క్యాష్ అవార్డులు తీసుకోవడం సంతోషంగా ఉంది.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్ కుమార్

గణేశ్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ సూచించారు. శాతవాహన విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక సంఘం వారి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులు మంచి శాస్త్రవేత్తలుగా మరియు విద్యావేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. సపాల ఇండస్ట్రీస్ అధినేత డాక్టర్ ఎల్లారెడ్డి మాట్లాడుతూ రసాయన శాస్త్ర విద్యార్థులకు ఉపాధి అవకాశాల గురించి వివరంగా చెప్పారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ సంబంధించిన సీనియర్ రసాయన శాస్త్రవేత్త కంటేవారి శ్రీనివాస్ మాట్లాడుతూ రసాయన శాస్త్రంలో ఎంఎస్సీ తర్వాత కూడా పరిశోధనలు జరపాలని అప్పుడే భవిష్యత్తు బాగుంటుందని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయంతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ డాక్టర్ నమ్రత, సదస్సు కోఆర్డినేటర్ డాక్టర్ సరసిజ, ముఖ్యఅతిథిగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్, విశ్వవిద్యాలయ కంట్రోలర్ డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ పాల్గొన్నారు.

సెపక్‌టక్రా రాష్ట్ర జట్ల ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

మల్యాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 6 నుంచి 8 వరకు పంజాబ్ రాష్ట్రంలోని సునాంలో జరిగే 6వ జాతీయ సెస్టోబాల్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ సెస్టోబాల్ సీనియర్, జూనియర్ రాష్ట్ర జట్ల ఎంపికను మండలంలోని నూకపల్లిలో గల ప్రతిభ హైస్కూల్‌లో బుధవారం ఎంపిక చేశారు. ఈ ఎంపికలో రాష్ట్ర కార్యదర్శి యాదవ్, రేఫరీ బోర్డు ఛైర్మన్ సత్యనారాయణ, తిరుపతిరెడ్డి, పీఈటీలు శ్రీనివాస్, నవీన్ సెస్టోబాల్ జిల్లా అధ్యక్షుడు భీమేష్, స్రవంతి, యశ్వంత్ పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులను పలువురు అభినందించారు.

వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం

● ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నం. 1912

● టీజీఎన్పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని టీజీఎన్పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ అన్నారు. వినియోగదారులు తమ సమస్యలను టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేసి తెలపాలన్నారు. ఫిర్యాదులను ఉన్నత స్థాయి అధికారులు సమీక్షించి త్వరితగతిన పరిష్కారం చేస్తారని వివరించారు. ఈ సదుపాయాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ మధ్య రహస్య ఎజెండా

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంభశివరావు

భగత్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్, బీజేపీ పార్టీల మధ్య రహస్య ఎజెండా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. బుధవారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా పరిస్థితులు గందరగోళంగా ఉన్నాయన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రాష్ట్రంలో అల్లకల్లోల పరిస్థితులను కల్పించాలని ప్రయత్నం చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ తప్పులు చేస్తే దాని ఎదుర్కొందాం కానీ బీజేపీ, బీఆర్ఎస్ ట్రాక్‌లో పడవద్దని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో మా విద్యార్థి సంఘాలు రైతు భరోసా, పంటల రుణమాఫీకి సంబంధించి సీపీఐ పోరాటం చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఎన్నో వాగ్దానాలు చేసిందని వాటిని అమలు చేయలేక పోవడానికి కారణాలేంటని ప్రజలకు స్పష్టం చేయాలన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్, గ్రామ పంచాయతీల్లో సర్పంచులు చేసిన పనులకు నిధులు, కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వలేని పరిస్థితిలోకి వచ్చిందన్నారు. పథకాలపై శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయలేక పోతున్నామని క్షమాపణ చెప్పాలన్నారు. విద్యార్థులపై లాఠీచార్జి లాంటి తప్పులు చేయవద్దన్నారు. మూసీ ప్రక్షాళన, హైడ్రాకు మేము వ్యతిరేకం కాదన్నారు. కానీ మూసీ ప్రక్షాళన, హైడ్రాతో పేదలకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. హైడ్రా అనేది పెద్ద వాళ్లు సేఫ్‌గా ఉన్నట్లు కనపడుతుందని, చిన్న వాళ్లకే గుండెపోటు వచ్చేలా ఉందన్నారు. పేదలు నాళాలకు, చెరువులకు అడ్డంకులు లేకుండా గుడిసెలు వేసుకున్నారని, వారిని క్రమబద్ధీకరణ చేయాలన్నారు. మూసీ ప్రక్షాళన కోసం వేరే దేశాలు వెళ్లి అధ్యయనం చేయడం కాదని, ముందు ఇక్కడ అధ్యయనం చేయాలన్నారు. విలేకరుల సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, పొనగంటి కేదారి, కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్, అందె స్వామి, టేకుమల్ల సమ్మయ్య గూడెం లక్ష్మి, బత్తుల బాబు, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతానికి సంఘటితంగా పనిచేయాలి

సీపీఐ బలోపేతానికి పార్టీ శ్రేణులంతా సంఘటితంగా పనిచేయాలని ఆ పార్టీ కూనంనేని సాంభశివరావు అన్నారు. బుధవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సీపీఐ కార్యవర్గ, కౌన్సిల్ సమావేశం కార్యవర్గ సభ్యుడు టేకుమల్ల సమ్మయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కూనం నేని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీ విస్తరణ కోసం కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. వచ్చే డిసెంబర్ 26 నాటికి సీపీఐ పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందన్నారు. సీపీఐ పార్టీ వంద ఏండ్ల పోరాటంలో చరిత్ర ను, త్యాగాలను ప్రజలకు వివరిస్తు సంబురాలు నిర్వహించాలన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాకు ఉద్యమాల చరిత్ర ఉందన్నారు. మహనీయులు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈసమావేశంలో జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, పొనగంటి కేదారి, కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్, అందె స్వామి, గూడెం లక్ష్మీ బత్తుల బాబు, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దీపావళికి ముస్తాబైన రాజన్న ఆలయం



దీపావళికి ముస్తాబైన రాజన్న ఆలయం

వేములవాడకల్చరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయం దీపావళికి ముస్తాబైంది. ఆలయంలో గురువారం నుంచి నరకచతుర్థశి వేడుకలు నిర్వ హించున్నారు. ఈ సందర్భంగా ఆలయ గోపు రాలు, ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఘనంగా మహాలింగార్చన

వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా బుధవారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మండ పంలో లింగాకారంలో దీపాలను వెలిగించి మహాలింగార్చన నిర్వహించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

చొప్పదండి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం మండలంలోని రేవెల్లి, పెద్దకుర్మపల్లి, దేశాయిపేట, మంగళపల్లి, చిట్యాలపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం చొప్పదండిలోని కుడి చెరువులో చేప పిల్లలను వదిలిపెట్టారు. క్యాంప్ కార్యాలయంలో 72 లక్షల విలువైన కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను అయన లబ్ధిదారులకు అందచేశారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, VOOTUKURI MALLAIAH, S/O. DHARMA REDDY, R/O. H.NO. 3-1-197/2, CHRISTIAN COLONY, KARIMNAGAR. HAVE CHANGED MY NAME AS " VOOTUKURI MALLA REDDY ", S/O. DHARMA REDDY.
AJK-16098

కొత్త ఇల్లు అమ్మబడును.

★ కరీంనగర్ రాంగనగర్‌లో ఉత్తరం, ఈశాన్యం వీధి చూపుగల 3BHK 255 చ.గ.లలో నూతనంగా నిర్మించిన ఇండిపెండెంట్ ఇల్లు అమ్మబడును. డబుల్ కారు పార్కింగ్ వసతి కలదు. సెల్ : 94405 17405
AJK-16075

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి
కరీంనగర్ :- సెల్ : 9703618691, 99854 10640
జగిత్యాల :- సెల్ : 99854 11262
మెట్‌పల్లి :- సెల్ : 70131 42966
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063
పెద్దపల్లి :- 95509 00238

సమాధుల వద్ద దీపావళి సంబరాలు

● నైవేద్యాలు సమర్పించి పెద్దలకు నివాళి
● కరీంనగర్‌లో ఆనవాయితీ



కరీంనగర్‌లో సమాధుల్లో ఏర్పాట్లు చేస్తున్న నగరపాలక సిబ్బంది

కరీంనగర్ కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గతించిన పెద్దలను స్మరిస్తూ కరీంనగర్‌లో సమాధుల వద్ద దీపావళి సంబరాలు జరుపుకుంటారు. ఏళ్లుగా ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. దీపావళికి ఒకటి రెండు రోజుల ముందు నుంచే సమాధులకు రంగులు, సున్నాలు వేసి అలంకరిస్తారు. దీపావళి రోజు సమాధుల వద్ద పెద్దలకిష్టమైన పదార్థాలు నైవేద్యంగా సమర్పించి టపాసులు కాలుస్తారు. అక్కడ వారికి నివాళులర్పించి గతించిన వారి స్మృతిలో గడుపుతారు. ఎక్కడెక్కడో ఉన్న కుటుంబ సభ్యులంతా ఒకే చోట కలుసుకొని కష్ట సుఖాలు కలబోసుకొని తొలుత కుటుంబాల వారీగా ఏర్పాట్లు చేసుకొని వేడుకలు జరుపుకోగా గత కొన్ని సంవత్సరాల నుంచి మున్సిపల్ కార్పొరేషన్ వారు తాగు నీరు, పరిశుభ్రత, లైటింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నారు. దీపావళి నాడు జరుగనున్న ఈ వేడుకలు ఆధ్యాత్మికతతో పాటు పెద్దల గతించిన వారి యెడల భక్తి భావాలను పంచనున్నాయి. కరీంనగర్ కార్ఖానగడ్డ, సవరన్ స్ట్రీట్, ఆదర్శనగర్ శ్మశాన వాటికల్లో దీపావళి సంబరాలకు మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాట్లు చేసింది.



పెద్దల సమాధి వద్ద దీపావళి సంబరాలు జరుపుకుంటున్న కుటుంబ సభ్యులు (ఫైల్)

కుల గణనను పారదర్శకంగా చేయాలి

గణేశ్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బీసీ కమిషన్ కుల గణన ను పారదర్శకంగా చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎన్నం ప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంకమ్మతోటలోని బీసీ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీసీ కమిషన్ నవంబరు 1న జరిపే పర్యటన సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో బీసీ సంఘాలు, బీసీ కుల సంఘాల వినతి పత్రాల స్వీకరణ వారి యొక్క అభిప్రాయాల స్వీకరణ సమయం ఒక గంట మాత్రమే కేటాయించారన్నారు. దాన్ని ఒక గంట నుంచి ఒక రోజుకు పెంచాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను 27శాతం నుంచి 42 శాతానికి పెంచాలని బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. ఈనెల రెండో తేదీన బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ సంఘాలతో పాటు బీసీ కుల సంఘాల నాయకులు, పార్టీలకతీతంగా బీసీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగు సంపత్, ఉపాధ్యక్షులు మాచర్ల అంజయ్య గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు శానగొండ శ్రీనివాస్, బండారి మల్లయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి వంగల రవి గోపాల్, బిసి విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేష్ చారి, కడారి ఐలయ్య యాదవ్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసం సందర్భంగా వేములవాడకు ప్రత్యేక బస్సులు

భగత్‌నగర్, అక్టోబరు 30(ఆంధ్ర జ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించు కుని వేములవాడ పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు కరీంనగర్ రీజి నల్ మేనేజర్ ఎస్ సుచరిత ఒక ప్రకటన లో తెలిపారు. సోమ, మంగళవారాల్లో వేములవాడ నుండి వరంగల్‌కు, శని ఆది వారాల్లో వరంగల్ నుండి వేములవాడకు ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు తెలిపారు. శబరిమలై, అరుణాచల గిరి ప్రదక్షిణలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు తెలిపారు. ముందస్తు రిజర్వేషన్ కోసం ఆర్టీసీ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

న్యూస్ బాక్స్

పుచ్చకాయపై సీఎం చిత్రం

- కళాకారుడి నైపుణ్యం





పుచ్చకాయపై సీఎం చిత్రం, (ఇన్‌సెట్లో) సంతోష్ చారి

గంభీరావుపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన వడ్రంగి చేపూరి సంతోష్‌చారి అనే కళాకారుడు పుచ్చకాయపై సీఎం రేవంత్‌రెడ్డి చిత్రాన్ని చెక్కి అభిమానాన్ని చాటాడు. చారీ గతంలో పలువురు మహానీయుల చిత్రాలను చెక్కి ప్రసంశలు అందుకున్నాడు. ఈ సందర్భంగా సంతోష్ చారీని పలువురు అభినందించారు.

దీపావళి సంబరాలు

తంగళ్లపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) తంగళ్లపల్లి మండల కేంద్రంలోని సరస్వతీ శుభోదయం ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో ముందస్తు దీపావళి సంబరాలు జరుపుకున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయులు పలు కార్యక్రమాలు చేపట్టారు. ప్రత్యేక పూజలు దీపావళి ప్రత్యేకత అంశాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ యాదవ్, ప్రిన్సిపాల్ మాధవి లతారెడ్డి, ప్రైమరీ ఇన్‌చార్జి పద్మశ్రీ, కవిత, వాణి సరిత ,కీర్తన , సందీప్, శిరీష, సత్య, పీఈటీ ప్రణయ్ పాల్గొన్నారు.

అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

జగిత్యాల అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణ అభివృద్ధి, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టితో ముందుకు వెళ్లాలని జగిత్యాల మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి అన్నారు. బుధవారం జగిత్యాల మున్సిపాలిటీ సర్వసభ్య సమా వేశం నిర్వహించారు. పట్టణంలో చెత్త సేకరణకు ఇబ్బందులు ఏర్పడడంతో పాత ఆటోల స్థానంలో 16 కొత్త ఆటోలు కొనుగోలు చేసినట్లు చెప్పారు.

విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలో విజిబుల్ పోలీసింగ్ విధానం మరింత పటిష్ఠం చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. వార్షిక తనిఖీలలో భాగంగా బుధవారం వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను తెలుసుకోవడంతో పాటు పోలీసులు స్వాధీనం చేసుకున్న వివిధ రకాల వాహనాలను పరిశీలించారు. పట్టణ సీఐ వీర ప్రసాద్‌కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా పోలీస్ విధులు ఉండాలని, వేములవాడ దేవస్థానానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టిసారించాలని అన్నారు. విలేజ్ పోలీస్ అధికారులు స్టేషన్ పరిధిలోని గ్రామాలు, వార్డులు పర్యటిస్తూ ఇన్ఫర్మేషన్ వ్యవస్థ పటిష్ఠం చేయాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో వీఎస్ అమలు చేసిన తీరు, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది డ్యూటీలపై అడిగి తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. వేములవాడ పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి రాజరాజేశ్వర దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలన్నారు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్ల్ హిస్టరీ షీట్స్, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా కఠినతరం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీ డ్రంకెన్‌డ్రైవ్ ఏర్పాటు చేయాలని, గంజాయి కిట్ల సహాయంతో అనుమానిత వ్యక్తులకు టెస్టులు నిర్వహించాలని అన్నారు. జిల్లాలో గంజాయి నివారణకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నామని, గంజాయికి సంబంధించిన సమాచారం సంబంధిత పోలీస్ వారికి లేదా, డయల్ 100కి అందించాలన్నారు. అధికారులకు, సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకుని ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలి అని సూచించారు. వేములవాడ పట్టణ పోలీసుల పనితీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ పట్టణ సీఐ వీరప్రసాద్‌ను, సిబ్బందిని అభినందించారు. ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, పట్టణ సీఐ వీరప్రసాద్, ఎస్సైలు రమేష్, రాజు ఉన్నారు.

ముస్తాబాద్: రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్‌మహాజన్ అన్నారు. ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. ఠాణాను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. కేసులు త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలను సేకరించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్సై గణేష్, ఏఎస్సై వెంకటరమణ, హెడ్‌కానిస్టేబుల్ భూమయ్య, పీసీలు దామోదర్, కుమార్, సంతోష్, కాశీం, రాజశేఖర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

గంభీరావుపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం కొత్తపల్లి, కోళ్లమద్ది, నర్మాల, లింగన్నపేట, గంభీరావుపేటలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ కొమిరిశెట్టి విజయ తిరుపతి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, ఐకేపీ ఏపీఎం సుదర్శన్, సీఏలు స్రవంతి, దీపిక, సునిత, నాయకులు ఉన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని వెల్జిపూర్, ఓగులాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాంప్రసాద్ రెడ్డిని సన్మానించారు. ప్యాక్స్ డైరెక్టర్ నాయిని నవీన్ కుమార్, ఏఎంసీ డైరెక్టర్ కంకణాల రాం ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లుల్లో ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 30 (అంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రైస్ మిల్లులలో ధాన్యాన్ని దిగుమతులు చేసుకొని సహకరిం చాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కోరారు. కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో బుధవారం జిల్లాలోని రా, బాయిల్డ్ రైస్ మిల్లుల బాధ్యులతో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్‌తో కలిసి సమావేశాన్ని నిర్వహిం చారు. రైస్‌మిల్లర్‌లకు రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలను వివరించారు. రైస్‌మిల్లర్ల అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు, బ్యాంక్ గ్యారంటీలు, టెస్ట్‌మిల్లింగ్ బియ్యం అందించే గడువు పెంచాలని, గోనె సమస్య సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మిల్లర్ల సమస్యలను ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి వసంత లక్ష్మీ, జిల్లా మేనేజర్ రజిత, డిప్యూటీ తహసీల్దార్‌లు, రైస్‌మిల్లుల బాధ్యులు చేపూరి నాగరాజు, పబ్బనాగరాజు, శ్రీనివాస్, గరిపెల్లి ప్రభాకర్ పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం

గొల్లపల్లి, ఆక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందేలా పోలీసులు కృషి చేయాలని ఎస్పీ అశోక్ కుమార్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం వార్షిక తనీఖీల్లో భాగంగా గొల్లపల్లి పోలీసు స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా పోలీసు స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీకి ఎస్సై చిర్ర సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా క్రైమ్ రికార్డులను, రిజిస్టర్లను, ఎంట్రీ చేసిన డేటాను తనిఖీ చేశారు. పెండింగ్ కేసులలపై రివ్యూ మీటింగ్ నిర్వహించారు. పోలీసు స్టేషన్ పరిధిలోని కేసుల నమోదు, శాంతి భద్రతల పరిరక్షణకు సంబంధించిన వివరాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డు, రైటర్ గదులతోపాటు పోలీసుస్టేషన్ ఆవరణ ను, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం అందిచేలా పోలీసులు కృషి చేస్తున్నారన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరుగుతుందనే భరోసాను పోలీసులు కల్పిస్తున్నారని, దీంతో జిల్లాలో గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. పెట్రోల్ కార్, బ్లూకోల్ట్స్ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు.

సర్వే సమగ్రంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో శేషాద్రి

తంగళ్లపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతీ కుటుంబ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల సర్వేను సమగ్రంగా నిర్వహించాలని డీఆర్డీవో, ఇన్‌చార్జి డీపీవో శేషాద్రి సూచించారు. బుధవారం తంగళ్లపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎన్యూమరేటర్లకు సమగ్ర కుటుంబ సర్వే పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర సర్వే షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. షెడ్యూల్‌లో పొందుపరిచిన పూర్తి సమాచారాన్ని సేకరించాలని సూచించారు. నమోదులో ఇబ్బందులు తలెత్తితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొచ్చి అధిగమించాలన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా నియమించిన శిక్షకులు సర్వేపై పూర్తిగా అవగాహన కల్పించారు. తహసీల్దార్ జయంత్‌కుమార్, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీవో మీర్జా, సూపరింటెండెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల వెంటపడతాం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల వెంటపడతామని బీఆర్ఎస్, కేటీఆర్ సేన నాయకులు అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ చార్జీలు రూ.18,500 కోట్ల భారాన్ని ప్రజలపై పడకుండా బీఆర్ఎస్ అడ్డుకొని విజయం సాధించిందన్నారు. కేసీఆర్, కేటీఆర్ కుటుంబం గురించి కాంగ్రెస్ నాయకులు అవాకులు చెవాలకులు పేలుతున్నారని, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న విమర్శలను ఖండించారు. ఉరిసిల్లగా ఉన్న సిరిసిల్లను సిరిశాలగా కేటీఆర్ మార్చారని, దీన్ని మరిచి అవాకులు చెవాకులు పేలుతున్నారని ఆరోపించారు. రైతులు, నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రాతో పేదలను పట్టి పీడిస్తోందన్నారు. అభివృద్ధిలో పోటీ పడుతూ కేటీఆర్ తీసుకొచ్చిన నిధుల కంటే ఎక్కువ నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రజా పక్షంలో బీఆర్ఎస్ ఉద్యమిస్తోందన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ మాట్ల మధు, కేటీఆర్ యువ సేన రాష్ట్ర కార్యదర్శి వెంగని మనోహర్, నాయకులు జక్కుల యాదగిరి, కంచర్ల రవిగౌడ్, సింగారం దేవదాస్, శీలం స్వామి, ప్రేమ్‌కుమార్, అమీర్‌రావు, మహేందర్, రాజేశ్వరరావు, కోడె శ్రీనివాస్, ఎనగందుల నరసింహులు, నవీన్ పాల్గొన్నారు.

విద్యుత్ సబ్సిడీ పెంపు హర్షణీయం



మాట్లాడుతున్న ఆసాముల సమన్వయ కమిటీ సభ్యులు

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 30 (అంధ్రజ్యోతి) : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న విద్యుత్ సబ్సిడీ 10 హెచ్‌పీల నుంచి 25 హెపీలకు పెంచుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం హర్షణీయమని సిరిసిల్ల ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల విద్యుత్ సమస్య పరిష్కారం కోసం కొన్ని రోజులుగా ఆసాముల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరాహార దీక్షలు, ఆందోళనలతో ప్రభుత్వం స్పందించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి, ఈఆర్‌సీ చైర్మన్ శ్రీరంగారావుకు ధన్యవాదాలు తెలిపారు. మా సమస్యలను ఎప్పటికప్పుడు విన్న మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విఫ్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సెస్ కార్యాలయంలో సెస్ చైర్మన్ చిక్కాల రామారావును కలిసి సన్మానించడంతోపాటు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసాముల సమన్వయ కమిటీ సభ్యులు మండల రాజు, ఆడెపు సాగర్, అమంచ సదానందం, చందా రాజమౌళి, కోడం రవి, వెంకటరమణ, సుమన్, బూర శ్రీనివాస్, అడ్డగట్ల భాస్కర్, పొరండ్ల భాస్కర్, దూస అశోక్, చిలుక రాజు, దూస రమేష్, సత్తిరెడ్డి, భీమనాతిని నరహరి, అంజనేయులు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారం పడకుండా బీఆర్ఎస్ కానుక



క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్ అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యుత్ నియంత్రణ మండలి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, మాజీ మంత్రులు, బీఆర్ఎస్ నాయకులు ఎక్కడికక్కడ ప్రజల వాణిని వినిపించారని, తెలంగాణ ప్రజలకు రూ.18500 కోట్ల విద్యుత్ భారం పడకుండా దీపావళి కానుకను అందించారని నాఫ్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారాన్ని పడకుండా ఆపడంలో బీఆర్ఎస్ విజయం సాధించడాన్ని హర్షిస్తూ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా వద్ద కేసీఆర్, కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కొండూరు రవీందర్‌రావుతోపాటు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడారు. అధికారంలో ఉన్న లేకపోయిన కేసీఆర్, కేటీఆర్ ప్రజలపై విశ్వాసంతో ఉన్నారన్నారు. విద్యుత్ నియంత్రణ మండలి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణలో విద్యుత్ చార్జీలను పెంచకుండా బీఆర్ఎస్ నాయకత్వం అడ్డుకుందన్నారు. సిరిసిల్ల ప్రాంతంలోని కార్మిక కుటుంబాలు పూర్తిగా మరమగ్గాలపైనే జీవిస్తున్నాయని కేటీఆర్ వివరించా రన్నారు. విద్యుత్ 10 హెచ్‌పీల నుంచి 30 హెచ్‌పీల వరకు విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలని విద్యుత్ నియంత్రణ మండలి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణలో కేటీఆర్ విజ్ఞప్తి చేశారన్నారు. కేటీఆర్ విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకొని విద్యుత్ 10 హెచ్‌పీల నుంచి 25 హెచ్‌పీల వరకు సబ్సిడీని వర్తింప జేసే విధంగా నిర్ణయం తీసుకున్నారని అన్నారు. సరైన నిర్ణయం తీసుకున్నందుకు ఈఆర్‌సీ చైర్మన్‌కు ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ అడగట్ల మురళి, గ్రంథాలయం జిల్లా మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్లు, వివిధ మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు, కార్యదర్శులు, బీఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వేములవాడ : మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు చొరవతోనే విద్యుత్ చార్జీల పెంపుదల నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకున్నదని వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రజలపై 18,500 కోట్ల రూపాయల అదనపు భారాన్ని సమర్థవంతంగా అడ్డుకున్నందుకు బుధవారం వేములవాడ పట్టణంలోని రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఎదుట బీఆర్ఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏనుగు మనోహర్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపు పేరిట రాష్ట్ర ప్రజలపై కోట్లాది రూపాయల అదనపు భారం మోపేందుకు ప్రభుత్వం సిద్ధమవగా కేటీఆర్ వ్యూహాత్మకంగా అడ్డుకొని ప్రజలపై అదనపు భారం పడకుండా కాపాడారన్నారు. బీఆర్ఎస్ నాయకులు రామతీర్థపు రాజు, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, బండ నర్సయ్య, మండల పార్టీ అధ్యక్షులు గోస్కుల రవి, మల్యాల దేవయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి కందుల క్రాంతి, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, నరాల శేఖర్, కొండ కనకయ్య, సిరిగిరి చందు, జోగిని శంకర్, కుమ్మరి శ్రీనివాస్, నీలం శేఖర్, గోలి మహేష్, మాజీ ఎంపీపీ చంద్రయ్య గౌడ్, మాజీ సర్పంచులు గోపు పర్శరాం, సుమన్, తిరుపతి, దేవరాజు, వెంకట్ రెడ్డి, ప్రదీప్, కె.గంగాధర్, మహేందర్, పిట్టల వెంకటేశం, మాజీ ఎంపీటీసీ అంజన్ కుమార్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కమలాకర్ రెడ్డి, మహేష్, లిక్కిడి మహేందర్, హరీష్, విజయ్ యాదవ్, శ్రీనివాస్, రాము, రామచంద్రం, వెంకన్న, శివ, పర్వేజ్, బాబా తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : విద్యుత్ చార్జీలను పెంచకుండా ఆపడంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించడం పట్ల ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్, మండల అధ్యక్షుడు కృష్ణహరి, నాయకులు సుభాష్, రమేశ్, నర్సింహారెడ్డి, నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి, మధు, జబ్బార్, సురేశ్, దేవరాజు, అనిల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం సర్వే చేపట్టాలి

ఇల్లంతకుంట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు ప్రకారం సమగ్ర కుటుంబ సర్వే చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ సూచించారు. మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేటర్లకు కేటాయించిన ఇళ్లకు తప్పనిసరిగా వెళ్లాలని, పూర్తి వివరాలు నమోదు చేయాలని అన్నారు. నిర్లక్ష్యానికి ఎలాంటి తావు ఇవ్వరాదన్నారు. తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీవో శశికళ, ఎంఈవో శ్రీనివాస్ గౌడ్, మాస్టర్ ట్రెయినర్స్ సందీప్‌రెడ్డి, జగన్మోహన్, సదానందం, రాజు, అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

వీర్నపల్లి: ప్రభుత్వం ఇంటింటా నిర్వహించే సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలందరూ సహకరించాలని ఎంపీడీవో రఘురాం అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల సర్వే కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటా ఇళ్ల జాబితా ప్రకారం సర్వే నిర్వహిస్తారని తెలిపారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల పరిషత్‌లో కుల గణన సర్వేపై బుధవారం శిక్షణ తరగతులను నిర్వహించారు. నవంబరు 6 నుంచి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల గణన సర్వేను చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అఫ్జల్‌బేగం, తహసీల్దార్ రామచంద్రం, ఎంపీడీవో సత్తయ్య, టీవోటీలు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో వేగం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్ రావు

వేములవాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మరింత వేగం పెంచాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్యాల ప్రదీప్ రావు కోరారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై బుధవారం వేములవాడలోని భీమేశ్వర గార్డెన్స్‌లో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసి పెద్ద సంఖ్యలో సభ్యులను చేర్పించాలన్నారు. నవంబర్ 10వ తేదీ నుంచి క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించాలని సూచించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, జిల్లా ఇన్‌చార్జి చంద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, వేములవాడ అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోపు బాలరాజు, పట్టణ శాఖ అధ్యక్షుడు రేగుల సంతోష్ బాబు, నాయకులు పాల్గొన్నారు.

పెద్దలింగాపూర్‌లో పౌరహక్కుల దినోత్సవం

ఇల్లంతకుంట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద లింగాపూర్ గ్రామంలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. రాజ్యాంగం అందిరికి సమాన హక్కులు ఇచ్చిందని, ఎవరైన వివక్షతకు గురైతే చట్టం రక్షణ కల్పిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు పసుల బాలరాజు, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, హెడ్‌కానిస్టేబుల్ రాజేందర్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో అధికారులు బుధవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామస్థులకు అంటరానితనం, పౌర హక్కులపై అవగాహన కల్పించారు. ప్రజలందరూ కలిసి మెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు సంతోష్, శ్రావణ్, పోలీస్ కానిస్టేబుళ్లు దిలీప్, రమేష్, జిల్లా విజిలెన్స్ ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యుడు తిరుపతినాయక్, పంచాయతీ కార్యదర్శి, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్ పౌరుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, ఏఎస్ఐ బాప తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి తడిసిన ధాన్యం



తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

గంభీరావుపేట, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలంలో పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి ధాన్యం తడిసి ముద్దయ్యింది. ముస్తాఫనగర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిపోయింది. దాన్యం కుప్పల వద్ద రైతులు ఇబ్బందులు పడ్డారు. వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని కోరారు.

పిల్లల దత్తతపై అవగాహన

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బుధవారం సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చట్టబద్ధంగా పిల్లల దత్తతపై అధికారులు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆ విభాగం ప్రొటెక్షన్ అధికారి ముదం లక్ష్మన్ చట్ట విరుద్ధంగా పిల్లలను దత్తత తీసుకోవడంతో వచ్చే సమస్యలను వివరించారు. బంధువుల పిల్లల్ని కూడా చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాలపై పోటీ

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం గాంధీనగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల ఆవరణలో బుధవారం చిన్మయి మిషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలపై పోటీలను నిర్వహించారు. విద్యార్థులను రెండు గ్రూపులుగా చేసి పోటీలను నిర్వహించగా వివిధ పాఠశాలల నుంచి దాదాపు 55 మంది విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రవంలో చిన్మయ మిషన్ ప్రధాన కార్యదర్శి నల్ల సత్యనారాయణ, న్యాయ నిర్ణేతలు జనపాల శంకరయ్య, సజ్జనం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక చేయూత

ముస్తాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆవునూర్ గ్రామానికి చెందిన మండపల్లి రాములు కూతురు వివాహం కోసం పార్లమెంట్ కో కన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి, రూ. 5 వేలు, మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు రూ.5 వేల నగదు అందించారు. నాయకులు ఏనుగు వేణు, బండి శ్రీకాంత్, కనమేని శ్రీనివాస్‌రెడ్డి, సద్ది మధు తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాస్

ధర్మపురి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మున్సిపల్ కమిషనర్‌గా కె శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్క డ మున్సిపల్ కమిషనర్ గా పనిచేసిన శ్రీనివాస్ రెడ్డి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో ఇక్కడ మున్సిపల్ మేనేజర్‌గా పనిచేస్తున్న బాలె గంగాధర్‌కు ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్య తలు అప్పగించారు. ఎట్టకేలకు ఇక్కడికి మున్సిపల్ కమిషన ర్‌గా శ్రీనివాస్ బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ధర్మపురి మున్సిపల్ మేనేజర్ బాలె గంగాధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్యాల గంగాధర్, ఆఫీస్ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు.